క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: పర్యాటకంలో భాగంగా ఆడలి వ్యూ పాయింట్ వద్ద పర్యాటకుల కోసం నైట్ క్యాంపింగ్ టెంట్లు, భోజన వసతి ఏర్పాటు చేసేందుకు ఆసక్తి కలిగిన గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు ఏజెన్సీ అందాలను వీక్షించడానికి వచ్చే పర్యాటకులకు ఆడలి వ్యూపాయింట్ వద్ద రాత్రి బస చేసేవారికి భోజనం, వసతి సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందన్నారు. అలాగే సీతంపేటలోని అన్ని పర్యాటక ప్రదేశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గైడ్‌గా కూడా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ఎంపికలో ఆడలి, సీతంపేట పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9392917692, 9493469084కు ఫోన్ చేయాలన్నారు.

15న మండల సమావేశం

సీతంపేట: ఈనెల 15న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.సత్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

విస్తారంగా వర్షాలు


భామిని: వర్షంలో తడుస్తూ వంశధార చెలమనీరు తెస్తున్న మహిళలు

జియ్యమ్మవలస/భామిని: బంగాళఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భామిని, జియ్యమ్మవలస మండలాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ పంటలకు అనుకూలంగా ఉంటాయని రైతులు అంటున్నారు. మరోవైపు వంశధార నదిలో వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉండడంతో చెలమల నీటిపై ఆధారపడే నదీతీర గ్రామస్తులు బిందెలతో నీటిని తెచ్చుకుని నిలువ చేసుకుంటున్నారు. గ్రామాల్లోని చెరువుల్లో పుష్కలంగా నీరుచేరడంతో ఈ సంవత్సరం పంటకు ఢోకా ఉండదని రైతులు అంటున్నారు.

తొలగించిన ఓట్లపై విచారణ చేయాలి


తహసిల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భామిని: మండలంలో ఓటర్ల జాబితాలో తప్పుడు ఓటర్ల తొలగింపు సక్రమంగా జరగలేదని, అకారణంగా కొందరు ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించారని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, కిల్లారి చంటి ఆరోపించారు. ఈ మేరకు తహసీల్దార్ నీలాపు అప్పారావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. బీఎల్ఓలు సక్రమంగా ఓటర్ల సర్వే చేయలేదన్నారు. తొలగించిన ఓట్లపై తక్షణమే విచారణ చేయించాలని కోరారు.

భవానీ మండల దీక్షలు


భవానీ దీక్షలు తీసుకొంటున్న స్వాములు

గరుగుబిల్లి: మండలంలోని రావివలస సంతోషమాత ఆలయంలో పలువురు భవానీ భక్తులు మంగళవారం భవానీ దీక్షలు చేపట్టారు. ఆలయ అర్చకులు తామరాపల్లి వెంకట లక్ష్మీనరసింహమూర్తి భవానీ భక్తులతో మాలధారణ చేయించారు. గ్రామానికి చెందిన జి.శివకుమార్, సీహెచ్.భానుప్రకాష్, జి.గౌరీశంకరరావు మండల దీక్షలు స్వీకరించారు. 40 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజలు చేసి, నియమాలను పాటించి అనంతరం విజయవాడలోని కనకదుర్గమ్మవారిని దర్శించుకోనున్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు 300 మంది ఎంపిక

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ పోటీల్లో 300 మంది విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారంతా ఈనెల 14,15 తేదీల్లో పాలకొండ మండలం ఎం.సింగుపురం స్కూల్‌లో జరగనున్న క్రీడా పోటీల్లో పాల్గొంటారని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మజ్జి రామకృష్ణ తెలిపారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన

- రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి


సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: రాష్ట్రంలో పారదర్శక పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డితో సాధ్యమౌతుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. నగరపంచాయతీ పరిధి 7వ వార్డులో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వలంటీర్లు, గ్రామ సచివాలయం ద్వారా అందుతున్న ప్రభుత్వ సేవలపై ఆరాతీశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. 7వ వార్డు పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు తెలియజేశారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' ద్వారా వార్డు పరిధిలో అభివృద్ధి పనులకు రూ.40 లక్షలు అందించనున్నట్లు చెప్పారు. వార్డులో పర్యటించిన ఎమ్మెల్యేకు స్థానిక మహిళలు హారతి ఇచ్చి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నగరపంచాయతీ వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావు, నగరపంచాయతీ మేనేజర్ జయరాం, కౌన్సిలర్లు కడగల రమణ, నీలాపు శ్రీనివాసరావు, తుమ్మగుంట శంకరరావు, బాసూరు కాంతారావు, కిల్లారి మోహన్, దుప్పాడ పాపినాయుడు, కొరికాన గంగునాయుడు, తూముల లక్ష్మణరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు పనుల పరిశీలన


చెరువు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళావతి

నగరపంచాయతీ పరిధి వడమ ప్రాంతంలోని చెరువు పనులను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం పరిశీలించారు. చెరువు అభివృద్ధికి ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేయడంతో వారం రోజులుగా పనులు జరుగుతున్నాయి. పట్టణానికి అనుకుని ఉన్న ఈ చెరువును సుందరంగా మార్చడంతో పాటు వాకింగ్ ట్రాక్, బోట్ షికారు ఏర్పాటు చేయనున్నారు. చెరువు గట్టును పార్కుగా తీర్చిదిద్దనున్నారు. అయితే ఈ పనుల నేపథ్యంలో చెరువు గట్టుకు కంచె ఏర్పాటు చేస్తున్నారని, దీంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నగపంచాయతీ మేనేజర్ జయరాంకు సూచించారు.

నేడు 6వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం'

పాలకొండ నగరపంచాయతీలోని 6వ వార్డు పరిధిలో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నగరపంచాయతీ మేనేజర్ జయరాం తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వ గుర్తింపుపై ఈయూ హర్షం


ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న ఈయూ నాయకులు

పాలకొండ రూరల్: ఏపీపీటీడీ(ఆర్టీసీ)లో అధిక సభ్యత్వం కలిగిన ఎంప్లాయిస్ యూనియన్‌కు ప్రభుత్వం గుర్తింపు లభించడం హర్షణీయమని ఆ సంఘం పాలకొండ డిపో నాయకులు వి.వి.రమణ అన్నారు. స్థానిక డిపో వద్ద ఉన్న యూనియన్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జోనల్ కార్యదర్శి బీకే మూర్తి మాట్లాడుతూ.. ప్రభుత్వ గుర్తింపుతో తమకు మరింత బాధ్యత పెరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఉద్యోగుల సమస్య పరిష్కారానికి, సంస్థ అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర నాయకులు బొప్పరాజు, పలిశెట్టి దామోదరరావు నాయకత్వంలో రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు, డిపో నాయకులు ఎం.వెంకట సూర్యనారాయణ, వెంకటరమణ, పి.కృష్ణారావు, ఆదినారాయణ, ఆనందరావు తదితరులున్నారు.

క్రికెట్ టోర్నీ విజేతగా పాలకొండ


ఫైనల్స్‌లో గెలుపొందిన ఆనందంలో పాలకొండ పీఆర్ బృందం


శ్రీకాకుళం న్యూకాలనీ: పంచాయతీరాజ్ ఇంజినీర్స్, ఉద్యోగుల క్రికెట్ టోర్నీ ముగిసింది. ఈ నెల 15న ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని పంచాయతీరాజ్ ఇంజనీర్లు, ఉద్యోగులలో నూతనోత్సాహాన్ని నింపేందుకు ఈ పోటీలు నిర్వహించారు. చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజనీరింగ్ కాలేజ్ మైదానం వేదికగా తొలుత బ్యాటింగ్ చేసిన పలాస నిర్ణీత 16 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసింది. అనంతరంబ్యాటింగ్ ప్రారంభించిన పాలకొండ 11.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఫైనల్ మ్యాచ్‌కు పంచాయతీరాజ్ ఎస్ఈ వీఎస్ఎన్ మూర్తి, ఈఈ గిరిధర్, డీఈఈ రామకృష్ణ తదితరులు హాజరై ఉద్యోగులను ప్రోత్సహించారు. ఈ నెల 15న ఇంజనీర్స్ డే సందర్భంగా ఉన్నతాధికారుల చేతులమీదుగా బహుమతులు అందజేయనున్నట్టు ఎస్ఈ చెప్పారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం


రాంబాబు మాస్టారును సత్కరిస్తున్న గ్రామస్తులు

వీరఘట్టం: తమ పిల్లల విద్యాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న చిట్టపులివలస ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సాకేటి రాంబాబును విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు మంగళవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల పనిదినాలతో పాటు సెలవు రోజు కూడా పాఠశాలకు వచ్చి విద్యార్థులకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బోధన చేస్తున్న రాంబాబు మాస్టారుకు ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇచ్చి సముచిత గౌరవాన్ని కల్పించిందన్నారు. వేసవి సెలవులు, దసరా సెలవులు, సంక్రాంతి సెలవుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ మా పిల్లల భవిష్యత్‌కు బాటలు వేస్తున్న మాస్టాకు జోహార్లు తెలియజేశారు.

నిబంధనలు పాటిస్తే.. పండగ ప్రశాంతం


విక్రయాలకు సిద్ధంగా ఉన్న గణనాథుని విగ్రహాలు

- గణేష్ ఉత్సవాల నిర్వహణకు అనుమతి తప్పనిసరి
- ఘర్షణలకు తావులేకుండా ఉత్సవ కమిటీలే బాధ్యత వహించాలి


పాలకొండలో అధికారుల అనుమతితో ఏర్పాటు చేస్తున్న వినాయక మండపం

పాలకొండ రూరల్: ఈ నెల 18 నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో యువత మండపాల ఏర్పాటులో నిమగ్నమయ్యారు. ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పాలకొండ సబ్‌డివిజన్ పోలీస్ అధికారి(డీఎస్పీ) జీవీ కృష్ణారావు సూచించారు. గణపతి మండపాల ఏర్పాటు, మైక్‌సెట్, విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుకు ముందస్తుగా పోలీసుశాఖ, విద్యుత్‌శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఇతరులకు ఇబ్బంది లేకుండా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరుగుకోవాలని కోరారు.

నిబంధనలు ఇలా..

- విగ్రహ ఏర్పాటుకు కమిటీ సభ్యులు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు పొందాలి.
- వివాదాస్పద స్థలాలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ప్రాంతాల్లో మండపాలకు అనుమతులు ఉండవు.
- విగ్రహాల, మండపాల వద్ద ఏర్పాటుచేసే సౌండ్ బాక్సులు, మైక్‌సెట్‌లకు అనుమతులు తప్పనిసరి. మితిమీరిన సౌండ్ నిషిద్ధం. ఉత్సవాల్లో భాగంగా అశ్లీల నృత్య ప్రదర్శలు చేయరాదు. మత్తు పానీయాలు సేవించరాదు.
- మండపాలకు విద్యుత్ సరఫరాకు విద్యుత్ శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలి. విద్యుత్ సిబ్బంది పర్యవేక్షణలోనే తాత్కాలిక కనెక్షన్ ఏర్పాటు చేయాలి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావిత్వకుండా ఉత్సవ కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.
- ఉత్సవ నిర్వహణకు సంబంధించి బలవంతపు చందాలు, వసూళ్లకు పాల్పడరాదు. ఇలా చేస్తే చట్టరీత్యా నేరం.
- మసీదులు, చర్చిల సమీపంలో మండపాలను ఏర్పాటుచేసే వారు నమాజ్, ప్రార్థనలు జరిగే ప్రత్యేక సమయంలో వారికి సహకరించే విధంగా సౌండ్ సిస్టమ్‌లను పూర్తిగా ఆఫ్ చేయాలి.
- అనుమానిత వ్యక్తులను, ఏదైనా సందేహాలు మండపాల వద్ద గుర్తిస్తే తక్షణమే పోలీసులకు తెలియపర్చాలి.
- రాత్రి 10 గంటల తరువాత మండపాల వద్ద కార్యక్రమాలను బంద్ చేయాలి. మైక్ సెట్లను ఆపివేయాలి.
- విగ్రహాల నిమజ్జన సమయంలో తగు నిబంధనలు పాటించాలి. ముఖ్యంగా ట్రాఫిక్ రూల్స్ పాటించటం, పోలీసుల సహకారం తీసుకోవాలి.
- వీలైనంతమేరకు నిమజ్జనాలు రాత్రి 9 గంటల లోపు పూర్తిచేయాలి. బాణాసంచా వాడకం సరికాదు.
- మండపాలు ఏర్పాటుచేసేందుకు అనుమతులు పొందకోరు సమయంలో నిబంధనలు పాటిస్తామని లిఖితపూర్వకంగా నిర్వాహకులు స్పష్టం చేయాల్సి ఉంటుంది.
- విగ్రహ ప్రతిష్ఠలు ఎక్కడ చేస్తారు, ఎప్పుడు నిమజ్జనం చేపడతారనే వివరాలు అనుమతులు పొందు సమయంలో పేర్కొనాల్సి ఉంటుంది.

ఆనందగా వేడుకలు జరుపుకోవాలి



అన్నివర్గాల ప్రజలు గణపతి నవరాత్రి వేడుకలను ఆనందంగా జరుపుకోవాలి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావిత్వకూడదు. ముఖ్యంగా అధికారులు సూచిస్తున్న నిబంధనలు మన మంచికే అన్న అంశాన్ని గుర్తించాలి. ఉత్సవకమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. హద్దు మీరితే చట్టపరమైన చర్యలు తప్పవన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఇప్పటికే పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో అన్ని స్టేషన్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వటం జరిగింది. ఇతరులకు ఇబ్బందులు లేకుండా వేడుకలు జరుపుకోవాలి.

– జీవీ కృష్ణారావు, డీఎస్పీ, పాలకొండ

ముందస్తు అనుమతులు తప్పనిసరి



వినాయక ఉత్సవాలకు సంబంధించి నిర్వాహకులు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలి. శాంతి భద్రలతకు విఘాతం ఏర్పడకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మండపాలను ఏర్పాటుచేసుకోవాలి. నిబంధనలు పాటిస్తే సమస్యలు తలెత్తవన్న విషయాన్ని మరువకూడదు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్‌శాఖకు సహకరించాలి. నిర్వాహకులు ముందుగా దరఖాస్తు చేసుకుంటే నిమజ్జన సమయంలో అవసరమైతే బందోబస్తు అందిస్తాం.

– బి.శివప్రసాద్, ఎస్సై, పాలకొండ

భద్రత ముఖ్యం



వినాయక నవరాత్రి ఉత్సవాలను అన్నివర్గాల ప్రజలు ఆనందంగా జరుపుకోవాలి. ఈ క్రమంలో భక్తుల భద్రత ముఖ్యం. ముందస్తుగా మా శాఖను సంప్రదిస్తే విద్యుత్ సరఫరా ఏర్పాట్లకు అనుమతులు మంజూరు చేస్తాం. విద్యుత్ చౌర్యంకు పాల్పడే క్రమంలో ప్రమాదాలు తప్పవనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ముందస్తు దరఖాస్తు చేసుకుంటే ఉన్నతాధికారుల సూచనలమేరకు తాత్కాలిక విద్యుత్ సరఫరాను మా సిబ్బంది పర్యవేక్షణలో చేపడతాం.

– ఎస్.శ్యామ్‌సుందర్, ట్రాన్స్‌కో ఏఈ, పాలకొండ

కొత్త పింఛన్ల పంపిణీ


లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న సచివాలయ కన్వీనర్, ఎంపీటీసీ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు పంచాయతీలో కొత్తగా పింఛన్లు మంజూరైన 16 మంది లబ్ధిదారులకు గ్రామ సచివాలయ కన్వీనర్ తోయక మాధవరావు, ఎంపీటీసీ మండంగి గౌరమ్మ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో ఎవరికైనా పింఛన్ మంజూరు కావాలంటే గ్రామంలో అప్పటికే పింఛన్ పొందుతున్న వ్యక్తి మృతి చెందితేనే మరొకరికి మంజూరు చేసేవారని, కానీ జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు పింఛన్ మంజూరు చేయడంతో పాటు నేరుగా ఇంటి వద్దకే వచ్చి అందించడం జరుగుతోందన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీసీఎన్ఎఫ్ కోఆర్డినేటర్ భూషణరావు

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్న రైతులంతా అందులో భాగమైన రాజీలేని సూత్రాలను పాటించి పంటలను తెగుళ్ల నుంచి రక్షించుకోవాలని ఏపీసీఎన్ఎఫ్ గుమ్మలక్ష్మీపురం క్లస్టర్ కోఆర్డినేటర్ కిమిడి భూషణరావు అన్నారు. మండలంలోని జే.కే పాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గిరిజన రైతులకు రాజీలేని సూత్రాలపై మంగళవారం అవగాహన కల్పించారు. పసుపురంగు పల్లెలు పొలాల్లో ఏర్పాటు చేసుకోవాలని, అలా చేయడం వలన పంటను ఆశించే రెక్క పురుగులను నివారించవచ్చాన్నారు. అలాగే పక్షి స్థావరాలను కూడా ఏర్పాటు చేయాలని, తద్వారా పక్షులు అక్కడ వాలి పురుగులను తినివేస్తాయన్నారు. ద్రవజీవామృతం తయారీని వివరించారు. దీన్ని పొలంలో పిచికారీ చేయడం వలన మొక్కలకు పోషకాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. పొలం గట్లపై కంది, బంతి, ఆముదం, కూరగాయలు, ఆకుకూరలు వేయడం వలన అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు.

విద్యార్థిని మృతి


సుమిత్ర (ఫైల్)

సీతంపేట: పాలకొండ పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో ఉంటూ అక్కడి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బైపీసీ గ్రూపు చదువుతున్న సవర సుమిత్ర(16) అనే గిరిజన విద్యార్థి జ్వరంతో బాధపడుతూ సోమవారం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మృతి చెందింది. సీతంపేట మండలం ఎర్రన్నగూడ సెంటర్‌కు చెందిన విద్యార్థిని పాలకొండ పట్టణంలోని వసతిగృహంలో ఉంటూ చదువుకునేది. శనివారం జ్వరం రావడంతో హాస్టల్ సిబ్బంది శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స అనంతరం తల్లిదండ్రులు ఆమెను ఇంటికి తీసుకొచ్చారు. మళ్లీ జ్వరం ఎక్కువవడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు గిరిజన సంక్షేమ శాఖాధికారులు తెలిపారు. ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు ఏటీడబ్ల్యూఓ మంగవేణి దీనిపై విచారణ చేస్తున్నట్లు డీడీ శ్రీనివాసరావు తెలిపారు. కుమార్తె మృతితో తల్లిదండ్రులు బాలిమ్మ, లక్ష్మిలు గుండెలవిసేలా రోధిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

సమన్వయంతో పనిచేయాలి

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది సమన్వయంతో చేపట్టాల్సి ఉంటుందని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి అన్నారు. తన కార్యాలయంలో సిబ్బందితో మంగళవారం సమావేశమై జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలుపై పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించాలన్నారు. గ్రామ సచివాలయం పరిధిలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వారందరికీ వైద్య సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు.

గర్భిణులు, చిన్నారులకు టీకాలు


టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ అరుణకుమారి

గరుగుబిల్లి: అర్హులందరికీ మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో టీకాలు వేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని రావివలస పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అరుణకుమారి అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో రావివలస, కారివలస, చిలకాం తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న రెండో విడత వ్యాక్సినేషన్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు, ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాధినిరోధక టీకాలను వేయనున్నట్లు తెలిపారు. ఏవైనా కారణాలతో టీకాలు వేసుకోని వారికి గుర్తించి వారికి ఆస్పత్రిలో టీకాలు వేయడం జరుగుతుందన్నారు. తట్టు, రుబెల్లా తదితర వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు.

ఉల్లాసంగా క్రీడా ఎంపిక పోటీలు


పాలకొండ రూరల్: క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు


భామిని: హోరాహోరీగా ఆడుతున్న బాలికలు

పాలకొండ రూరల్: మండలంలోని ఎం.సింగుపురం జెడ్పీఉన్నత పాఠశాలలో మంగళవారం అండర్–17 వాలీబాల్, అండర్–14 ఖోఖోతో పాటు వివిధ క్రీడలకు సంబంధించిన ఎంపిక పోటీలు ఉత్కంఠగా జరిగాయి. ఈ పోటీల్లో ఎం.సింగుపురం, భాసూరు, చిన్నమంగళాపురం, పాలకొండ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. అండర్–17 బాలికల ఖోఖో పోటీల్లో డీఏవీ విద్యార్థులు రాణించారని పీడీ రాకోటి రాములు తెలిపారు. మండల, పాఠశాల స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో గెలుపొందిన జట్లు ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గోనున్నారు. ఈ ఎంపిక పోటీలను గ్రామ సర్పంచ్ రణస్థలం రాంబాబు, ఎంఈఓ సోంబాబు, హెచ్ఎం సంగం నాయుడు, క్రీడల నిర్వహణ ఇన్‌చార్జీ వి.పుష్పనాథం, వై.సురేష్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

హోరాహోరీగా పోటీలు

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణంలో మంగళవారం అండర్–14 క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను ఎంఈఓలు ఎ.శ్రీనివాస్, వి.భాస్కరరావు, పీఈటీ శివరామప్రసాద్ పర్యవేక్షించారు. ఇందులో ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

80 లీటర్ల సారా స్వాధీనం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ పరిధి ఎస్.కె.పాడు గ్రామ పరిసరాల్లో మంగళవారం నిర్వహించిన దాడుల్లో 80 లీటర్ల సారాను పట్టుకున్నట్లు ఎస్సై ఎస్.షణ్ముఖరావు తెలిపారు. సారాతో పాటు ఓ మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయడంతో పాటు జుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.